కథ

# ప్రమోషన్





రోహిణి కార్తె ఎండలతో అల్లాడిన జనానికి మృగశిర చినుకులు కాస్త ఊరట నిచ్చాయి. స్కూళ్ళు తెరిచారు. రెండు నెలలు ఆట పాటలతో గడిపిన పిల్లలు బడిబాట పట్టారు. తల్లిదండ్రులకు క్రొత్త స్కూళ్ళ వెతుకులాట. కొత్త పుస్తకాలు, కొత్త కాపీలు, కొత్త స్కూలు డ్రెస్సులతో సీతాకోకచిలుకల్లా పిల్లలు.

నెత్తిన రేకు సందుకలు, పక్కబట్టలు సర్దుకొని హాస్టలు చేరుకుంటున్న విద్యార్థులు, నల్లగొండలో వున్న పది హాస్టల్లలో అదొకటి. అది బి.సి. హాస్టల్. కులాలు మతాలు లేవంటున్న లౌకిక రాజ్యంలో కులానికో హాస్టల్. యస్.సి, యస్.టి, బి.సి హాస్టల్లు, కమ్మ హాస్టల్, రెడ్డి హాస్టల్, వైశ్య హాస్టల్, గౌడహాస్టల్, విశ్వకర్మ హాస్టల్‌లు పుణ్యక్షేత్రాలలో సత్రాల్లా వెలిశాయి. కొన్ని ప్రభుత్వం నడిపితే ఇంకొన్ని కులసంఘాలు నడుపుతున్నాయి.

వందమంది బి.సి. హాస్టల్ పిల్లలంతా స్కూల్లు తెరిచినకాడ నుండి రోజూ కొంతమంది వస్తున్నారు. లేటయితే వార్డెన్ కోప్పడతాడని కొంతమంది పిల్లలు తండ్రుల వెంట తెచ్చుకుంటున్నారు. ఓ వారం రోజుల్లో హాస్టలు

మేరెడ్డి యాదగిరి రెడ్డి

నిండి పోయింది. వచ్చినవారు వచ్చినట్లే హాస్టల్ వార్డెన్ శంకర్రావుకు రిపోర్టు చేసి హాజరు వేయించు కుంటున్నారు. పిల్లలంతా తమ తమ రూముల్లో పెట్టెలు, పక్కబట్టలు సర్దు కుంటున్నారు. పది గదులున్న హాస్టల్ అది. స్టోర్‌రూమ్ వేరే వుంది. గదికి పదిమంది పిల్లలు. ఎవరి తలదగ్గర వాళ్ళ పెట్టెలు. సామాన్లు భద్రపరుచుకున్నారు. వరుసగా పక్కలు పర్చుకున్నారు. కిటికీలకు కట్టుకున్న దండెం తాళ్లు వాటిమీద పిల్లల డ్రాయర్లు బనియన్లు. ఓ మూల కిచెన్. కిచెన్ పక్కన ఓ చేతి బోరింగు. బోరింగు చుట్టు గిన్నెలు, పళ్లేలు, గ్లాసులు చిందర వందరగా పడి వున్నాయి. ఎప్పుడు వచ్చే నాలుగు ఊరకుక్కలువాటి చుట్టూ కాపలా కాస్తున్నాయి. పక్కన మంకెన చెట్టుమీద ఓ పది కాకులు ఒకటే అరుపు.




శంకర్రావు కాక ఇంకో ఇద్దరు వంట మనుష్యులు ముగ్గురు సర్వర్లు ఆ హాస్టల్‌లో పని చేస్తున్నారు. స్టోర్‌రూమ్, ఆఫీస్‌రూమ్ ఒక్క గదిలోనే, ఓపక్క బియ్యం, ఉప్పు, పప్పు, కారం, నూనె చింతపండు, బట్టలు, పుస్తకాలు సబ్బులు చిందరవందరగా పడి వున్నాయి. ఇంకోవైపు వార్డెన్ కుర్చీ టేబిల్ అల్మారా.

స్టాక్ రిజిస్టరు ముందేసుకున్న శంకర్రావు బ్యాలెన్స్ షీట్ తయారు చేస్తున్నాడు. ఏప్రియల్‌లో మిగిలిన సరుకులు ఇప్పుడు తెచ్చిన సరుకులు స్టాక్ రిజిస్టర్‌లో ఎంటర్ చేసి రోజువారి ఖర్చు రాస్తున్నాడు. స్టాకుకు బ్యాలెన్స్‌కు తేడా వస్తే అధికారులతో అదోతంటా.

హాస్టల్ల తనిఖీకి ఇది వరకయితే ఆర్నెల్లకో ఏడాదికో తమశాఖ వారు వచ్చేవారు. వాళ్ల నెలనెలా మామూళ్లు వాళ్లకు ముడితే ఏపేచీ వచ్చేది కాదు. తామాడింది ఆట పాడింది పాట అన్నట్టుండేవి ఆ రోజులు. ఇప్పుడందరు అదుగుదుగాల్లె. బెదిరిచ్చుదు గాల్లె. వార్డు మెంబరు కానించి సర్పంచ్, యం.పి.టి.సి, జడ్.పి.టి.సి, మండలాధ్యక్షులు ఇంకా చోటా మోటా నాయకులు అంతా బెదిరిచ్చుడు గాండ్లే.

స్టూడెంట్ లీడర్లు, లోకల్ గూండాలు అందరికి భయపడి చావాల్సిందే. ఈ మధ్య యం.యల్.ఏల హాస్టల్ నిద్ర. ఎప్పుడు ఎవరొస్తారో తెలియదు. వెదవ ఉద్యోగం. ఇంకా తహశీల్‌దార్లు, యం.డి.వోలు, తమశాఖ అధికారులు అడుగడుగునా తనిఖీలే. అన్నం బాగుందా, కూర బాగుందా చారు నీళ్లాలె వుందా! అన్నీ ప్రశ్నలే ఆలోచిస్తూ కూర్చున్నాడు శంకర్రావు. పైన గాంధీపటం అంబేద్కర్ పటం గాలికి అటూ ఇటూ వూగుతున్నాయి.

గతంలో శంకర్రావు బాగానె సంపాదించాడు. వందమంది పిల్లలున్న హాస్టల్‌లో ఎప్పుడూ యాభైమంది కంటే ఎక్కువ తినేవారు కాదు. హెడ్ మాస్టర్‌ను మేనేజ్ చేసి వందమందికి హాజరు వేయించుకుని రేషన్ డ్రా చేసి అమ్ముకునేవాడు. పట్టణం నడిబొడ్డున ఓ అందమయిన రెండంతస్తుల ఇల్లు, దగ్గరలో ఓ పదెకరాల తోట, హైదరాబాదులో ప్లాట్లు, ఓ కారు, ఓ మోటరుసైకిలు ఇవన్నీ ఆయన సంపాదించినవే. రియల్ ఎస్టేట్, బోరింగ్, బండ్లు, ప్రొక్లెయిన్ మిషన్లు తనతోటి వార్డెన్ నాగిరెడ్డి భాగస్వామ్యంతో నడిపించాడు. బాగానే కలిసొచ్చింది. ఇద్దరూ బాగానే సంపాదించారు.

పిల్లలంతా ఒకరినొకరు పలకరించుకుంటున్నారు. కుక్కర్లు, సర్వర్లు పిల్లల బాగోగులు తెలుసుకుంటున్నారు. హాస్టల్‌లో సందడే సందడి. "నమస్కారం సారు" పదవతరగతి శీను.

"నమస్తే" రిజిస్టర్ నుండి తలపైకెత్తాడు శంకర్రావు. ఎదురుగా శీను. శీనును చూసేసరికి శంకర్రావు ముఖంలో రంగులు మారాయి. వల్లంతా తేల్లు జెర్రులు పాకినట్లయింది. శంకర్రావుకు ఇంకో పదినెలల్లో రిటైర్‌మెంటు వుంది. ఓ ప్రమోషన్ రావల్సి వుంది. ఆ ప్రమోషన్ వస్తే పెన్షన్‌లో ఓ లక్షరూపాయలు కలిసి వస్తాయి. ఏదో ఈ పదినెలలు నిమ్మలంగా గడుపుకుంటే హాయిగా బయట పడ వచ్చు. ఓ మూడు నెలల ముందు హాస్టల్‌లో ఓ విద్యార్థి మరణం అతన్ని చిక్కుల్లో పడవేసింది. ఇప్పుడు ఈ శీనుగాడొకడు. తరచు మూర్ఛ వ్యాధితో పడిపోతున్నాడు.

"శీను నీ పేరు హాస్టల్ నుండి తీసేశా" నెమ్మదిగా అన్నాడు శంకర్రావు శీను గుండెల్లో రాయి పడ్డట్టయింది. వల్లంతా వణుకుడు వచ్చింది.

"ఎందుకుసార్ ఎందుకు సార్" కండ్లలో నీళ్ళు వచ్చాయి. ఏడుపొక్కటే తక్కువ. "నీ ఆరోగ్యం బాగాలేదు. నీకు మూర్ఛలు వస్తున్నాయి. యాద పడిపోతవో నీకే తెల్వదు. నీ కావలి ఎవరుంటరు. నాకా పెన్షన్ దగ్గరొచ్చింది. నీకే మన్నయితే నేనండ్లఇరుక్కపోవల్సిందే. మొన్ననే ముకుందం సంగతి నీకెరెకె గద. ఎంత పరేషానయ్యానో".

"మీ వూరి దగ్గర తిప్పర్తి హాస్టల్‌లో చేర్పిస్త. అక్కడ హైస్కూలుంది. అక్కడే చదువుకో. అక్కడయితే మీ వూరు దగ్గర. అమ్మనాయినలు వచ్చి చూసుకుంటరు" రిజిస్టరు మూసేస్తూ శంకర్రావన్నాడు.

"మంచిగయింది సార్. నాకు మూర్ఛలు ఏం వస్తలేవు సార్. సెలవుల్లల్ల మా నాయిన దవాఖానాకు తీసుక పోయి మందులిప్పించ్చిండు. డాక్టరు గోలీలు రాసిచ్చిండు సార్. దినం పొద్దుమాపు వేసుకుంటున్న. ఇప్పుడు బాగానె వున్నాసార్".

"ఈ ఒక్కేడయితే పదయిపోద్ది సార్. వూరికి పోతే మానాయిన పనికి బొమ్మంటడు. చదువు బందయిద్ది సార్" బతిమిలాడుతూ అన్నాడు శీను.

"ఇప్పుడు గట్లనే అంటరు. అయిటంక ఏమన్నయితే నాగొంతు మీదికొస్తుంది. నన్ను విసిగించకు పొయ్యి తిప్పర్తిల చదువుకో" బండి స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు శంకర్రావు. శంకర్రావు వెళ్ళిన వైపు అలా చూస్తూ నిలబడిపోయాడు శీను. పిల్లలంతా శీను చుట్టూ చేరారు.

మూడు నెలలముందు అంటే పాఠశాలలు బందయ్యేముందు హాస్టల్ రూంలో గోవిందు అనే పిల్లవాని వందరూపాయలు పోయాయి. ఆ రూమ్‌లో పిల్లలంతా ఒకటే గోల ఒకరినొకరు తిట్టుకున్నారు. తోసుకున్నారు. గోవిందుది ఒకటే ఏడుపు. ఈ గోలకు హాస్టల్ పిల్లలంతా ఆ రూమ్‌కు వచ్చి చేరారు. పిల్లల చప్పుడు విని శంకర్రావు అక్కడికి వచ్చాడు. విషయం తెలుసుకున్న శంకర్రావు నౌకర్లతో అందరి పిల్లల సందుకలు బ్యాగులు వెదకమని చెప్పాడు. ముకుందం సందుకలో వందరూపాయిలనోటు దొరికింది. ముకుందం సందుకకు తాళం లేదు. ముకుందం ఏడ్చాడు. మొత్తుకున్నాడు. "నేను తీయలేదు సార్. ఎవరో నా సందుకల పెట్టిండ్రుసార్" ఎంత మొత్తుకున్న ఎవరు వినిపించుకోలేదు.

ముకుందం చాలా తెలివైనవాడు. తొమ్మిదో తరగతి క్లాస్‌ఫస్ట్. పిల్లలకు ఉపాధ్యాయులకు ఇష్టమైనవాడు. అందరు అతన్ని మెచ్చుకునేవాల్లె. ఎవరిజోలికి పోడు. తన చదువేందో తను అంతే. మొదట్లో ముకుందం డబ్బులు తీశాడంటే శంకర్రావుకు నమ్మబుద్ధి కాలేదు. స్కూల్ టీచర్లు గూడా అదేమాటన్నారు. ఆకతాయి పిల్లలెవరో ఆ డబ్బులు

తీసి ముకుందం సందుకలో వేసి ఉండవచ్చు అనుకున్నాడు. కాని మందలించకుంటే బాగుండదని ముకుందాన్ని సుతిమెత్తగా మందలించాడు.

ఆ రాత్రి ముకుందం అన్నం ముట్టుకోలేదు. రాత్రంతా ఏడ్చి ఏడ్చి చెంపలమీద కన్నీటి దారలు అట్టుకట్టాయి. పిల్లలందరి ముందు తనను దొంగగా చేసినందుకు తెగబాధపడ్డాడు. ముకుందానిది సున్నిత మైన మనస్సు. తట్టుకోలేకపోయాడు. తెల్లవారి రెండవ శనివారము ఆదివారము పిల్లలంతా తమ తమ ఇండ్లకు వెళ్లారు. ముకుందం కూడా వాళ్ళ వూరు తొరగల్లుకు వెళ్ళాడు.

ముకుందంది అతిపేద కుటుంబం. వున్న మూడెకరాల భూమి తోనే తల్లి దండ్రి వ్యవసాయం చేసి నెట్టుకొస్తున్నారు. ముకుందం వున్న వూరిలోనే ఐదవ తరగతి పూర్తి కాగానే తల్లిదండ్రి చంద్రమ్మ, ఇద్దయ్యలు నల్లగొండలో బడిలో చేర్పించి హాస్టల్‌లో వేశారు. పదోతరగతి దాకా ఢోకా లేకుండా చదువు కుంటాడని వాళ్ల ఆశ.

ముకుందం ఇల్లు చేరిన రాత్రి పెద్దవర్షం పడింది. తల్లిదండ్రి చీకటితోనే లేచి వంట వండి విత్తనాలు వేసేందుకు చెలకలకు బయలుదేరారు. తల్లి పడుకున్న కొడుకును లేపింది. "నీ కిష్టమని చేపలు చింతచిగురు కూరవండిన కొడుకా అన్నం కూర వుట్టిమీద పెట్టిన ముఖం కడుక్కోని తినుబిడ్డా. అన్నం యాల్లకు వచ్చి నీ బట్టలుతుకుత రేపు పోదువు గాని" ముకుందానికి చెప్పి వాల్లిద్దరు అరకతోలు కొని చెలకలకు పోయారు. ముకుందం తల్లిదండ్రి వెల్లిన వైపే చూస్తూకూర్చున్నాడు. రేపు స్కూలుకెళితే పిల్లలెంత గేలిచేస్తరో టీచర్లేమంటారో అతని మనస్సు భయంతో నిండిపోయింది.

పగటేల్ల అన్నానికి తల్లిదండ్రి ఇంటి కొచ్చే సరికి లుంగీతో దూలానికి వేలాడుతున్న ముకుందం శవం తల్లిదండ్రి ఒకటే ఏడుపు. ఏడ్చి ఏడ్చి తల్లి సొమ్మసిల్లి పడిపోయింది. ఆ ఏడుపు చప్పుడుకు వూరంతా అక్కడ చేరింది. క్షణాలమీద వార్త నల్ల గొండ హాస్టలుకు, పాఠశాలకు చేరింది. పిల్లలు, ఉపాధ్యాయులు, వార్డెన్ అంతా అక్కడికి చేరారు.

విద్యార్థి సంఘాలు,ఉపాధ్యాయులు, మీడియా అంతా అక్కడికి వచ్చారు. ముఖ్యంగా వార్డెన్ శంకర్రావు ముకుందాన్ని తిట్టాడనే విషయం బయటకు పొక్కింది. శంకర్రావును సస్పెండు చేయాలని విద్యార్థి సంఘాలు దర్నాలు చేశాయి. కుడితిలో పడ్డ ఎలు కలా తయారయింది శంకర్రావు పరిస్థితి.

మధ్యవర్తుల సాయంతో చావు ఖర్చులకు ఇరువయి వేలు తల్లిదండ్రులకిచ్చాడు. ఆందోళన చేసే నాయకులకు లోపాయకారిగా కొంత ముట్ట చెప్పాడు. అలాగే పోలీసులకు కూడా బారీగానే ముట్ట చెప్పాడు. "తన కుమారుడు కడుపునొప్పి భరించలేక వురేసుకున్నాడని" తల్లిదండ్రులతో స్టేట్‌మెంటిప్పించాడు. పోయిన కొడుకెలాగు రాడు. ఆయన నౌకరి పీకేపిస్తే మాకేమొస్తదని అంత ఏడుపులో కూడా ఆ దంపతుల ఔదార్యం అందరిని ఆశ్చర్యపరిచింది. కేసు ఓ కొలిక్కి వచ్చేవరకు శంకర్రావుకు ఓ లక్ష రూపాయలు వదిలాయి. అదే టెన్షన్‌లో వున్న శంకర్రావు శీనును హాస్టలు నుండి పంపాలని నిర్ణయించుకున్నాడు.

శీను చదువంతా చిత్రవిచిత్రంగా సాగింది. శీను తండ్రి వీరేశం తల్లి మల్లమ్మ ఇద్దరు వడ్డెరపని చేసేవారు. వాళ్ల కులవృత్తి అదే. వ్యవసాయ బావులు తవ్వడం ఇండ్ల బునియాదిలు తీయడం, పైపు కాల్వలు తియ్యడం, పిల్లర్ గుంటలు తీయడం వారి పని. బావులు పోయి బోరింగులు వచ్చి కాల్వలు తీసే ప్రొక్లెయిన్లు వచ్చి వాళ్ల పొట్టలు గొట్టాయి. బయట ఏ పని దొరికితే ఆ పని చేసి పొట్ట పోసు కుంటున్నారు.బిడ్డపెండ్లి కుదిరింది. బిడ్డపెండ్లికి శీనును ఆ ఊరి టీచర్‌దగ్గర జీతం బెట్టి అప్పు తెచ్చి పెండ్లి చేశాడు. నాల్గవ తరగతి చదువుతున్న శీను నేను చదువుకుంటానని ఎంత మొత్తుకున్నా వినక బడి మాన్పించి జీతం వుంచాడు తండ్రి. ఆ విధంగా శీను చదువు అర్ధాంతరంగా ఆగిపోయింది.

శీను క్రిష్ణయ్య టీచరు బర్లగాస్తున్నాడు. అప్పటి జిల్లా కలెక్టరు బాలకార్మిక వ్యవస్త మీద ఉక్కుపాదం మోపాడు. జిల్లాలోని మొత్తం అధికారు లందరిని అప్రమత్తం చేసి ఉరుకుల పెట్టించాడు. జిల్లాలోని మొత్తం బాలకార్మికుల సర్వేచేయించాడు. బాలకార్మికులను జీతానికి పెట్టుకున్న యజమాను లందరికి నోటీసులుజారీ అయ్యాయి. ఇరువయి అయిదువేల జుర్మానా ఆరునెలల జైలుశిక్ష ఇది నోటీసు సారాంశం. కొంతమందికి జుల్మానాలు వేశారు. యజమానులంతా హడలిపోయారు. చాలా మంది స్వచ్ఛందంగా పిల్లలను పనినుండి పంపించి వేశారు. కృష్ణయ్య గూడ తన టీచర్ ఉద్యోగం ఎక్కడ ఊడుతుందో అన్న భయంతో శీనును జీతం నుండి పంపించి వేశాడు.

మండలానికి వందమంది బాలకార్మికులతో బాలకార్మిక పాఠశాలలు ఏర్పాటయ్యాయి. బ్రిడ్జి కోర్సును ఏర్పాటు చేసి ఓ సంవత్సరం తర్వాత పిల్ల లందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి హాస్టల్లలో పెట్టించారు. కొంతమందిని వెలుగు ఆశ్రమ పాఠ శాలల్లో కస్తూర్బా ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించారు. ఆశ్రమంలో హాస్టల్‌లో చేరి చదువు కుంటున్నవాడే శీను.

తెల్లవారే వరకు ఆగమేఘాల మీద తండ్రిని



26-7-2008 'చెలిమి- సాంస్కృతిక సంస్థ, శ్రీ త్యాగరాయ గానసభ – హైద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో కళాసుబ్బారావు వేదికపై 'ఆణిముత్యం' ప్రైవేట్ ఆల్బమ్ ఆడియో సిడీ ఆవిష్కరణ జరిగింది. చిత్రంలో 'చెలిమి' వ్యవస్థాపకులు పి.యం. సుందరరావు, సిడి పాటల రచయిత "సుస్వరశ్రీ" లంకా వెంకట సుబ్రహ్మణ్యం, సినీ దర్శకులు ఆకుల రాఘవ, దూరదర్శన్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ ఓలేటి పార్వతీశం, గాయకులు – సంగీత దర్శకుడు జి.వి. ప్రభాకర్. సమన్వయకర్త మెరుగు రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

వెంటబెట్టుకొని హాస్టలు వార్డెన్ ఇంటికి చేరాడు శీను. శంకర్రావు పూజ చేసుకొని అయ్యప్పస్వామి బొట్టు పెట్టుకొని హాస్టల్‌కు పోదామని బండి స్టార్ట్ చేసే పనిలో వున్నాడు "దండం దొరా",

నల్లకళ్లద్దాలు తీసి అటువైపు చూశాడు. గేటు దగ్గర శీను. శీను తండ్రి వీరేశం. వీరేశం లోగడ చాలాసార్లు హాస్టలుకు వచ్చాడు. అందుకే వెంటనే గుర్తించాడు. వీరేశం తలమీద రుమాలు, మోకాళ్ల వరకు కాయిపట్టిన దోతి పైన నూలు బనియను, చేతులకు ముంజేతి కడియాలు. నెరిసిన పెద్ద మీసాలు గడ్డం.

"మా శీను గాన్ని హాస్టలు నుంచి పొమ్మన్న రటగా దొరా!" వీరేశం గేటు బయటనుండే అన్నాడు.

"మరేం చేయను వీరేశం. రోజులు బాగా లేవు. గింతదానికి గంతదానికి మా ప్రాణాలమీది కొస్తున్నాయి. మీ వోనికా మూర్ఛరోగం. ఇది వరకే రెండు మూడు సార్లు హాస్టల్‌లో పడిపోయాడు. స్కూల్లో గూడా పడిపోయి పరేషాన్ జేసిండు. ఎప్పుడు ఏమయితదో తెలుస్తలేదు".

"మీ పిల్లగాన్ని మీ వూరి దగ్గర తిప్పర్తి హాస్టల్‌లో చేర్పిస్త. ఆడనే చదువుకోమను. దీనికింత పరేషానెందుకు. తిప్పర్తి వార్డెనుకు ఫోను జేసిచెపుత' సముదాయిస్తూ అన్నాడు శంకర్రావు.

"అదిగాదు దొరా ! మావోనికి బాగయింది. ఇప్పుడేం లేదు. పట్నం పెద్ద దావఖానాకు తీసుక పోయినం. గోలీలు వాడుతున్నం. మావూల్లో గూడ చెట్లపసర్లు పోపిచ్చిన. నాటు మందులిప్పిచ్చినం. మంచిగయింది. ఈ ఒక్క ఏడు మీరు దయతలిస్తె ఆపది ఐపోద్ది" చేతులెత్తి దండం పెడుతూ బ్రతిమి లాడాడు వీరేశం.

"చూడు వీరేశం ఇది బస్తీ లారీలు, బస్సులు కార్లు తెగ తిరుగుతయి. మీవాడు బడికి పోయి వస్తుంటడు, దేని కింద పడిపోతడో తెల్వదు. మంచి మాట చెబుతున్న వినురి. అక్కడయితే మీరు దగ్గ రుంటరు. అక్కడ ఇన్ని లారీలు బస్సులుండవు." నచ్చజెప్ప చూశాడు శంకర్రావు.

"సార్. సార్ ఈ ఒక్క సంవత్సరం ఇక్కడనే చదువుకుంట సార్" శీను అభ్యర్థన.

"నేను రాసిస్త దొరా ! మావోని కేమన్నయితే నాదే జిమ్మేదారి తెల్లకాగితం మీద ఎక్కడ అద్దమంటే అక్కడ ఏలి ముద్రవేస్త దొరా ! మీరే దయ చూపాలి" గేటు దగ్గరి కొస్తున్న శంకర్రావు కాళ్ల పట్టుకోబోయాడు వీరేశం.

"జరుగు జరుగు. ఇదేంపని తనే వెనుకకు జరిగాడు శంకర్రావు". చెపుతుంటే మీగ్గాడు" చిరాకుగా కోపంగా అన్నాడు శంకర్రావు.

"ఇప్పుడేమయింది. తిప్పర్తి హాస్టల్ వార్డెన్‌కు ఫోను చేస్తున్న చూడురి జేబులో నుండి సెల్ తీసి తిప్పర్తి వార్డెన్‌తో మాట్లాడాడు. శీనును హాస్టల్‌లో చేర్చుకొమ్మని మరీ మరీ చెప్పాడు.

గుడ్డిలో మెల్ల ఇది కొంత మేలే అనుకున్నారు తండ్రి కొడుకు. ఏదో విధంగా వాళ్లకు నచ్చచెప్పి బైకెక్కి బయటపడ్డాడు శంకర్రావు.

వాళ్లముందు తిప్పర్తి వార్డెన్ చెప్పినట్లే చెప్పి వాళ్లు అలా వెళ్లగానే శీను మూర్ఛరోగం సంగతి పూస గుచ్చినట్లు చెప్పాడు శంకర్రావు తిప్పర్తి వార్డెన్‌కు. కొలీగ్‌తో తనకెందుకు తంటా అని ముందే చెప్పాడు.

గత సంవత్సరమే హాస్టల్‌లో చదువుతూ చదువుతూ పడిపోయాడు శీను. నోటి నురగ, కాళ్లు చేతులు కొట్టుకోవడం, నాలుక బయటకు రావడం కండ్లు ఇంతింత లావుగావడం అందరిని భయ పెట్టాయి. స్కూల్లోగూడా ఇలానె జరిగింది. ప్రభుత్వ హాస్పిటల్‌లో చేర్పించి తండ్రికి కబురు చేశారు ఉపాధ్యాయులు.

వీరేశం శీనును ఇంటికి తీసుకెళ్లి పసరు మందులు యిప్పించాడు అయినా తగ్గలేదు. వున్న రెండు మేకలు అమ్మి ఓ అయిదువేలు తీసుకుని ఆ వూరి ఆర్.యం.పి డాక్టరుని తీసుకుని హైదరాబాదు ఉస్మానియా హాస్పిటల్‌కు తీసుకుపోయారు. అక్కడి డాక్టర్లు అన్ని పరీక్షలు చేసి "మూర్ఛ" జబ్బని తేల్చారు. ఓ అయిదు సంవత్సరాలు గోలీలు వాడితే తగ్గుతుంది భయం లేదని చెప్పారు. అప్పటినుండి శీను బాగానే వున్నాడు. మళ్లీ మూర్ఛలు రాలేదు.

అప్పుడే శీనును హాస్టలు నుండి పంపిద్దా మనుకున్నాడు శంకర్రావు. మార్చి పరీక్షలు దగ్గర కొచ్చాయని ఆగిపోయాడు. వుత్తపుణ్యానికి ముకుందం చావుతో లక్షరూపాయలు వదిలి చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు కేసునుండి బయటపడ్డాడు. అందుకే వాళ్లెంత బతిమిలాడినా వినకుండా బయటకు పంపించివేశాడు.

శీను బడిలో టి.సి. తీసుకుని వచ్చి తిప్పర్తి స్కూల్లో చేరాడు. తండ్రిని తీసుకుని తిప్పర్తి హాస్టల్ వార్డెన్ దగ్గరికి సీటుకోసం వెళ్లారు. నల్లగొండ వార్డెన్ శంకర్రావు ఫోను చేసిన విషయం జ్ఞాపకం చేశారు.

"ఇదిగో చూడండి శంకర్రావుగారు ఫోను చేసి చెప్పారు. మీకు సీటిద్దామనే అనుకున్నారు. తీరా చూస్తే మీ వూరు ఇక్కడికి నాలుగు కిలోమీటర్లె. అయిదు కిలోమీటర్ల కంటె ఎక్కువ దూరం వున్న వూర్లవాళ్లకే సీటియ్యాలని రూల్స్ వున్నాయి. రూల్స్ కాదని నేను ఏమీ చేయలేను" చావుకబురు చల్లగా చెప్పి తప్పించుకున్నాడు తిప్పర్తి హాస్టల్ వార్డెన్.

గతంలో తమ ఊరి పిల్లలందరూ ఇదే హాస్టల్‌లో చదువుకున్నారు. ఇప్పుడీ మెలిక ఏందో వాళ్లకు అర్థం కాలేదు. చేసేది లేక ఇంటిదారి పట్టారు.

శీనుకు చదువుపట్ల పట్టదల వార్డెన్ల మీద కసిపెరిగాయి. ఇంటికి వచ్చి తండ్రి పాత సైకిలు రిపేరు చేసుకునిరోజూ బడికి వెళ్లి వస్తున్నాడు.

శంకర్రావు నాగిరెడ్డి ఇద్దరు వార్డెన్లె, ఇద్దరు జిగినిదోస్తులే. శీనుగాడి పీడ విరగడయిందని ఆ రాత్రి ఇద్దరు మందుపార్టీ చేసుకున్నారు. మందుపార్టీ వాళ్లకు మామూలే. రోజూ ఏదో ఒక బార్‌లో సిట్టింగ్ వేయడం అలవాటే. శంకర్రావు కంటే నాగిరెడ్డి కొద్దిగా జూనియర్. నెలలతేడా. ఇద్దరు కలిసి చాలా వ్యాపా రాలు చేశారు. రియల్ ఎస్టేట్, బోరింగు బండ్లు, ప్రొక్లెయిన్లు, హార్వెస్టర్లు ఎప్పుడు ఏది గిరాకి వుంటే అదే చేస్తూ వస్తున్నారు. ఇద్దరికి తోటలున్నాయి. ఇద్దరికి హైదరాబాదులో ప్లాట్లున్నాయి. కాకుంటే నాగిరెడ్డి కొడుకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.

తనకు శీను పీడ విరగడయిందని ఇక ప్రమోషన్‌కు ఏ అడ్డంకి లేదని తెగ సంబరపడ్డాడు శంకరరావు.

హాస్టల్‌లో ఓ సీటు ఖాళీ అయిందని బయటకు పొక్కింది. చలమయ్య కొడుకుని హాస్టల్‌లో వేయాలని తెగ తిరిగాడు. ఎవరో చెబితే ఐదొందలు, తీసుకుని శంకర్రావు దగ్గరకు వచ్చాడు. తన కొడుక్కు హాస్టల్‌లో సీటీయమని ప్రాదేయపడ్డాడు. ముందు శంకర్రావు బెట్టు చేశాడు. సీటు లేదన్నాడు. చలమయ్య జేబులో నుండి ఐదొందలు తీసి టేబుల్‌మీద పెట్టాడు. శంకర్రావు కండ్లు మిలమిల మెరిశాయి. వద్దు వద్దంటూ డబ్బులు తీసి జేబులో పెట్టుకోబోయాడు. అదనుకోసం వేచి వున్న ఎ.సి.బివారు రంగప్రవేశం చేసి రెడ్‌హేండెడ్‌గా పట్టుకున్నారు. ప్రమోషన్ కాదుగదా ! శంకర్రావు వున్న వుద్యోగం వూడి కటకటాల పాలయ్యాడు.

అసలు విషయం ఏమిటంటే ఎ.సి.బి కి వుప్పందించింది ఆప్తమిత్రుడునాగిరెడ్డే. డబ్బంటే పడి చచ్చే శంకర్రావు మనస్తత్వం రెడ్డికి బాగా తెలుసు. చలమయ్యకు ఐదొందలిచ్చింది నాగిరెడ్డే. ఇప్పుడున్న సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసరు రిటైరయ్యాడు. పోస్ట్ ఖాళీగా వుంది. అది బంగారు బాతు. పోస్ట్ ప్రభుత్వం నింపే వరకు ఓ ఆర్నెల్లయినా పడుతుంది. ఇప్పుడు తనకు ప్రమోషన్ వస్తే ఇంచార్జి సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసరు తనే. ఆర్నెల్లలో లక్షలు సంపాదించవచ్చు. తనకు అడ్డున్న శంకర్రావును తొలగించాలని ఈ మాస్టర్ ప్లాను వేశాడు రెడ్డి. అదను చూసి దెబ్బ కొట్టాడు.

కొద్దిరోజుల్లో నాగిరెడ్డికి ప్రమోషన్ ఆఫీసర్ చార్జి వచ్చాయి. శంకర్రావు వుద్యోగం వూడి పోయింది. శీను పదవతరగతి ఫస్ట్ క్లాసులో పాసయ్యి మండల టాపర్‌గా నిలిచాడు.